# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక




# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా, లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొందుచున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్యమాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. **20/-** లు మాత్రము పోస్టేజి ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYA VANI**
P.O. Box 80, Sambamurthi St.,
KAKINADA - 533 004.

## ప్రకటన

318 క్రైస్తవ కీర్తనలు గల పుస్తకము ఇంకొకటి ఇప్పుడు లభించుచున్నది. దాని ఖరీదు రూ. **10/-** లు; పోస్టు ఖర్చులు రూ. 1-50 అదనం. వలయువారు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి :

T. PRAKASA RAO
Church of Christ - Bible Learning Centre,
KOMAROLE - 523 373.

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 14 ఆగష్టు 1993 సంచిక 1


## సంపాదకీయము

### యేసు మరల ఎప్పుడు వచ్చుచున్నాడు ?

### (When will Jesus Come Again?)

యేసుప్రభువు రెండవ రాకడ కొరకు తేదీలు నిర్ణయించువారు ఎవరో ఒకరు లేకపోలేదు. ఆయన రాకడ దినమును ప్రవచించువారందరు అబద్ధికులయ్యారు. ఆయన రాకడ సమయాన్ని గూర్చిన సమాచారాన్ని ప్రభువు మానవుల కియ్యలేదని వారు ఎన్నడు నేర్చుకొనరా? ఆయన రాకడ సమయాన్ని గూర్చి యేసు మనకు తెలియజేయాలని అనుకొనియుంటే, అది మనకు తెలియజేయుటకు దానిని ఆయన గుర్తులతోను, అలంకార భాషలోను వర్ణించియుండకపోవును. ఆయన రాకడ తేదీ ఏదీ ఇయ్యలేనందున దానికేదో కారణం ఉండియుండవచ్చును. ఆ కారణమేమంటే ప్రభువును ఎదుర్కొనుటకు సిద్ధపడకుండా ఆఖరి గడియవరకు కని

పెట్టుట కంటే ఆయన ప్రజలు ఎల్లవేళలా ఆయనకు నమ్మకముగా యుండాలని ఆయనయొక్క కాంక్ష అయ్యున్నది.

ప్రభువు త్వరగా వచ్చుచున్నాడని అనేకులు చెబుతారు. అంటే ఆయన ఖచ్చితంగా మన జీవితకాలంలో వస్తున్నాడని వారి ఉద్దేశ్యము. అది కావచ్చును, కాకపోవచ్చునుకూడ. అపొస్తలులు ఆదిమ క్రైస్తవులు కూడ ప్రభువు వారి జీవితకాలంలోనే, త్వరలోనే తిరిగి వస్తాడని ఎదురు చూచారు. పరలోకమందున్న తండ్రియొద్దకు ఆయన ఆరోహణుడైనప్పటినుండి క్రీస్తు ప్రభువు త్వరలో తిరిగి వస్తాడని అందరు ఎదురు చూచుచునే యున్నారు. అయినను ఆయన ఇంకా రాలేదు. అంటే ఆయన ఇంక తిరిగి రారా? కానేకాదు, గాని ఆయన మన ప్రణాళిక ప్రకారం గాక తన ప్రణాళిక ప్రకారం వస్తున్నాడని దీని భావం.

ఆయన మరల వస్తానని చెప్పి ఇంచుమించు రెండువేల సంవత్సరము లయ్యినది. గనుక ఆయన త్వరలో వచ్చుచున్నాడని చెప్పుట భావ్యంకాదని కొందరు తలస్తారు. అయితే ఆయన ఈవేళ వచ్చినా లేక ఒక లక్ష సంవత్సరాల తరువాత వచ్చినా నిత్యత్వంతో పోల్చ కొంటే ఈ సమయం కొద్ది పాటిదే. గనుక యేసు త్వరలో వచ్చు చున్నాడని చెప్పుట సమంజసమే. క్రీస్తు రాకడను గూర్చి కొన్ని సంగతులు మనకు తెలుసు. దేవుని వాక్యాన్ని గౌరవించేవారు వాటితో సంతృప్తి చెందాలి.

1. నేను మరల వత్తునని యేసు చెప్పారు: "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను, నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినయెడల

నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును" అని ఆయన చెప్పారు (యోహాను 14:1-3).

2. పరలోకమందున్న తండ్రి తప్ప ఆయన రాకడ సమయమును ఎరిగిన వారెవరు లేరని మనకు తెలియజేయబడింది: "అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే యెరుగును గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు" (మత్తై 24:36).

3. రాత్రివేళ దొంగ వచ్చినట్లు యేసు వచ్చునని చెప్పబడింది. పేతురు యిట్లు చెప్పాడు: "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును" (2 పేతురు 3 : 10). ఆయన ఒక దొంగకాదు గాని ఎవరికి తెలియని సమయంలో ఆయన వచ్చును.

4. ప్రభువు తిరిగి వచ్చునప్పుడు భూమ్యాకాశములు గతించిపోవును (2 పేతురు 3:10). ఆయన వచ్చి భూమిమీద వెయ్యేండ్లు పాలించుననే సంగతి యేమీ లేదు. నీతిమంతులు పైకెత్తబడుట దుష్టులు భూమిమీద విడువబడుట యను దానిని బైబిలు బోధించుటలేదు.

5. క్రీస్తు తిరిగి వచ్చునప్పుడు నీతిమంతులు అనీతిమంతులు కూడ లేపబడుదురు. ఆయన ఇట్లు చెప్పారు: "దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలోనున్న వారందరు ఆయన శబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5 : 28, 29).

6. ప్రభువు వచ్చుసరికి సజీవులై యున్నవారు ఆయనను

ఎదుర్కొనుటకు మేఘములమీద కొనిపోబడుదురు. అపొ. పౌలు ఇట్లను చున్నాడు: "ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకమునుండి ప్రభువు దిగి వచ్చును. క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ ఉందుము" (1 థెస్స 4:16, 17).

7. దేవుని రాజ్యము లేక సంఘములో ఆటంకములు కలుగ జేయువారిని సమకూర్చి నరకములో పడవేయుటకు ప్రభువు తన దూతలను పంపును. యేసు ప్రభువు ఇట్లు చెప్పారు: "మనుష్య కుమారుడు తన దూతలను పంపును, వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని దుర్నీతిపరులను సమకూర్చి అగ్నిగుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును పండ్లుకొరుకుటయును ఉండును" (మత్త 13:41, 42).

8. గొప్ప కడవరి తీర్పు జరుగును: "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును (హెబ్రీ 9:27). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము యెదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5 : 10).

9. తీర్పునాడు నీతిమంతులు దేవునితో నిత్యము ఉండుటకు కొనిపోబడుదురు. దుర్మార్గులు నిత్య శిక్షకు గురి యగుదురు (మత్త 25 : 46).

అవును క్రీస్తు మరల వచ్చుచున్నాడు. త్వరగా వచ్చుచు

న్నాడు. ఆనాడు అనేక సంగతులు జరుగును గాని అవి అనేకులు చెప్పులాగున జరుగవు. ఆయన రాకడనుగూర్చి, ఆనాటి సంఘటనలనుగూర్చి నీవు మోసగించబడవద్దు. అయితే ఆయన రాకడకొరకు నీవు సిద్ధపడి యున్నావా అనేది పెద్ద ప్రశ్న. లేనియెడల సమయముండగానే నీవు సిద్ధపడవలెను. యేసు నిశ్చయముగా వచ్చుచున్నాడు. ఆయన ఎప్పుడు వచ్చునో మనకు తెలియదు గాని ఆయన రాకడ తథ్యము.

—o—

## తప్పులకు తప్పు

## (The Mistake of Mistakes)

ఈ లోకంలో ఇంకా పుట్టనివారు, చనిపోయినవారు మాత్రమే తప్పు చేయరు. మనం చేయు తప్పులు చాలమట్టుకు చిన్నవే. కొన్ని వెంటనే సులువుగా సరిదిద్దేసుకోవచ్చు. వాటివల్ల ప్రమాదం యేమీ జరుగకపోవచ్చును. ఈ దిగువ బైబిలు వచనములు ఒక ఘోరమైన పొరబాటును గూర్చి చెప్పుచున్నవి:

"అప్పుడాయనను అప్పగించిన యూదా, ఆయనకు శిక్ష విధింపబడగా చూచి పశ్చాత్తాప పడి, ఆ ముప్పది వెండి నాణెములు ప్రధాన యాజకుల యొద్దకును పెద్దలయొద్దకును మరల తెచ్చి - నేను నిరపరాధి రక్తమును అప్పగించి పాపము చేసితినని చెప్పెను. వారు దానితో మాకేమి? నీవే చూచుకొనుమని చెప్పగా అతడు ఆ వెండి నాణెములు దేవాలయములో పారవేసి, పోయి ఉరి పెట్టుకొనెను" (మత్త 27:3-5).

ఎవడైనా క్రీస్తును నిరాకరిస్తే అది గొప్ప పొరబాటే. ఇస్కరియోతు యూదా యితర తప్పుల నెన్నో చేసియుండవచ్చును, అయితే

అతడు క్రీస్తును అప్పగించినప్పుడు తన జీవితంలో ఎన్నడు చేయలేనంత ఘోరమైన తప్పును చేసాడు. అది తప్పాలకు తప్పు!

తనకున్న తరుణములను కోల్పోయినవాడు ఇస్కరియోతు యూదా. ఒకప్పుడు అతడు సువార్త ప్రకటించినవాడే. మరియు అపొస్తలుల ఖజానాదారు కూడాను. అయితే తన జీవనయాత్రలో ఎక్కడో ఒకచోట క్రీస్తును వెంబడించుట మాని ఖజానాను వెంబడించ మొదలు పెట్టాడు. బైబిలు ఇట్లు చెప్పుచున్నది: "ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" (1 తిమో 6 : 10). ఒకడు వెంటాడు సంగతులను బట్టి అతడెట్టివాడో తెలియునుగదా. అయితే ఇస్కరియోతు యూదా రక్షకుని మాని ధనాన్ని వెంటాడుటకు మొదలిడినప్పుడు అతని శీలం యేమీా పెరగలేదు. అతడు నమ్మశక్యం కోల్పోయాడు, రక్షణ పోగొట్టుకొన్నాడు.

## మూల్యం పొరబాటు

ఇస్కరియోతు యూదా చేసిన ద్రోహానికి అతడు చెల్లించిన మూల్యము చాల ఎక్కువ. అతడు తన చోటికి పోయాడని అపొ.కా. 1 : 25 చెప్పుచున్నది. ఆ ముప్పది వెండి నాణెములనుండి అతడు పొందిన లాభం యేమీా లేకపోయింది. ఇస్కరియోతు అపరాధినని యెరిగాడు, చింతించాడు, ఆత్మహత్య చేసుకొన్నాడు. దేవుడు లేని వారు నిరుత్సాహవంతు లవుతారు. ద్రోహం చేసినవారు తరుచు తమ దుష్క్రియల ఫలితాన్ని అనుభవిస్తారు. హామాను ఎవరికో తయారు చేసిన ఉరికంబముపై తానే ఉరి తీయబడ్డాడు (ఎస్తేరు 7:9-10). దాని యేలు శత్రువులు తమ కీడును తామే అనుభవించుకొన్నారు. వారేమి విత్తారో దానినే కోసుకొన్నారు. ఏ సింహముచేత దానియేలును చంపాలని యత్నించారో అదే సింహముచేత వారు, వారి కుటుంబములు నాశనం గావించబడ్డాయి (దానియేలు 6:24).

# నీ జీవిత పొరబాటు

క్రీస్తును నిర్లక్ష్యం చేస్తూ తమ ఆత్మ క్షేమముగానే యున్న దని తలంచేవారు చాలమంది యున్నారు. అలాగ నమ్మేవారు నిజంగా చాల బుద్ధిహీనులే. "నేను ఆయననని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములోనే మరణింతురని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 8:24). ప్రియ చదువరీ, నీవాయనను నిర్లక్ష్యము చేసిన ట్లయితే నీ జీవితములో గొప్ప పొరబాటును చేయుచున్నావు. మనం అపవిత్రమైన జీవితాన్ని జీవిస్తూయుంటే ఆయనకు ద్రోహం చేయు చున్నట్లే, ఉదాసీనత కలిగియుంటే ఆయనకు ద్రోహం చేయుచున్నట్లే. నైతిక సద్వర్తనకంటే ప్రజాదరణ ముఖ్యం అని అనుకొనుచున్న యెడల ఆయనకు ద్రోహం చేయుచున్నట్లే. మనం ఆయన రాజ్యాన్ని మొదట వెదుకకపోయిన యెడల ఆయనకు ద్రోహం జరిగించు చున్నాము. ఈ లోక భాగ్యాన్ని కాంక్షించితే ఆయనకు ద్రోహం చేయుచున్నట్లే.

యూదా ఇస్కరియోతు ఆనందాన్ని అనుభవించవలసి యుండగా అతడు నిస్పృహా నిరుత్సాహాన్ని ఎంచుకొన్నాడు. అతడు పరలోకాన్ని పొందవలసి యుండగా నాశనాన్ని కోరుకొన్నాడు. సమస్తాన్ని పొందవలసినవాడుగా యుండి శూన్యాన్ని ఎంచుకొన్నాడు. ఇస్కరియోతు యూదా చేసిన తప్పు మనం చేయకూడదు. ప్రభువును అప్పగించుటకు బదులు ఆయనయందు విశ్వాసముంచుము. ప్రభువును అమ్ముకొనుటకు బదులు ఆయనకు నిన్ను నీవు సమర్పించుకో. "ఒకడు నీటిమూలముగను ఆత్మమూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని" యేసు చెప్పెను (యోహాను 3 : 5; గలతీ 3 : 26-27).

—బిల్ డిల్లాన్ (TVC).

—o—

# నిత్య జీవిత తృష్ణ

## ( Man's Longing for Immortatity )

భూమిమీద మానవుల వయోపరిమాణము స్వల్ప కాలమే అయినను వారందరిలో సహజముగా ఒక కోరిక యున్నది. అది నిత్యము జీవించవలెననెడి కోరిక. చావు అనిన సహజముగ భయపడు వాడు మానవుడు. గోత్రికర్తయగు యోబు అలనాడెప్పుడో 'మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా?' యని ప్రశ్నించి తనలో యున్న నిత్యజీవిత తృష్ణను వెలిబుచ్చెను (యోబు 14:14). యోబు వేసిన ప్రశ్న మానవజాతి ఆరంభమైన నాటినుండి నేటివరకు వేయబడుచున్న ప్రశ్నయై యున్నది. హేబెలు చనిపోగా ఆదాము హవ్వలు, చివరకు కయీనుకూడ అతడు మరల బ్రతుకునా? యని ఆలోచించి యుండకపోరు. లక్షలకొలది మానవులు నేడు చనిపోవుచున్నారు గనుక ఇది మనము తరుచు ఎదుర్కొనుచున్న ప్రశ్నయై యున్నది. 'మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా', యని యోబు అడిగిన ప్రశ్న ఈనాడు మన ప్రశ్నయై యున్నది. గనుక మన మందరము అమర్త్యత (Immortality) వెదకుచున్నామని ఒప్పుకొనక తప్పదు.

## అమర్త్యత

అయితే అమర్త్యత (Immortality) అనగా యేమిటి? ఒకడు మరణించిన తరువాత అతని ఆత్మ జీవించి యుండుట లేక ఉనికిని కలిగియుండుట అమర్త్యత అని సాధారణముగ అందరు తలంచెదరు. అంటే - ఒకడు మరణమొందగానే అతడు అంతమొంది యుండలేడు అని అందరు అంగీకరించుచున్నారు. ఇందు విషయమై బైబిలు చెప్పునదేమంటే - ఒకడు మరణించిగా అతని ఆత్మ జీవించుచునే యుండును. సరిగదా ఒకానొక దినమందు అది నిత్యత్వము (Eternity) లో

ప్రవేశించునపుడు శరీరముతో పునరుత్థానమగును. ఆత్మ శరీరముతో ఏకమై మరి ఎప్పటికి ఎడబాయకుండు నిమిత్తము లేపబడును. క్రైస్తవునికి ఇది బహు ధన్యకరమైన స్థితి యగును.

నిత్యజీవితము యథార్థమైనదని మానవులు నమ్ముటకు అనేక ఋజువు లున్నవి. పురాతన నాగరికతలను మనము పరిశోధించిన యెడల వేలకొలది సంవత్సరముల క్రితమున్న ప్రజలకు నిత్యజీవము నందు నమ్మక మున్నదని ఋజువగుచున్నది. ఉదాహరణకు ఐగుప్తు దేశీయులు ఆకాశము నంటుకొనియున్నట్లు నిర్మించుకొనిన పిరమిడ్లు (గోపురములు) దీనికొక సాదృశ్యముగ యున్నవి. భారతీయులలో పునర్జన్మను గూర్చిన యభిప్రాయములు ప్రబలి యున్నవి. దీనిని బట్టి మానవుడు శాశ్వతముగా నిర్మూలించబడుటకు కాదు గాని ఏదో ఒక రీతిగ తను శాశ్వత ఉనికిని కలిగియుండుటకు ఆశించుచున్న వానిగా కనబడు చున్నాడు.

మానవజాతి యంతటిలోను మార్పు జెందని కొన్ని నిత్యసత్యము లున్నవి. అవి ఒకే ఒక్క దేవునియందు నమ్మక కలిగియుండుట, మంచి చెడు అను విచక్షణ జ్ఞానము, భావిజీవితమందు ప్రగాఢమైన విశ్వాసము, క్రియ ప్రక్రియలను గూర్చిన జ్ఞానము మొదలగునవి. ఇవి సార్వజనికమైనవి. మానవులకు వీటిని గూర్చి యెవడును బోధించకనే వారు వీటిని యెరిగి యున్నారు. ఈ సంగతులను గూర్చిన వారి జ్ఞానము ఎక్కడనుండి వచ్చినదో మనము వివరించుకొన లేక పోయినను వారి విశ్వాసము ఆధారము లేనిది కాదు.

ఈ భూమిపై యున్న జీవరాసులన్నియు ఏదో ఒక ప్రయోజనమును కలిగియున్నవి. కొన్ని మానవునికి ఆహారము కొరకు ప్రయోజనకారులై యున్నవి. కొన్ని క్రిమి సంహారకులుగాను, మరి

కొన్ని మన వాతావరణమును పరిశుభ్రముగా నుంచునవిగాను యున్నవి. అయితే ఈ పుడమిపై మానవుని ప్రయోజన మేమిటి? అతడు తన సృష్టికర్తయైన దేవుని కొనియాడుచు, మహిమ పరచుచు ఆయనతో నిత్యము జీవించుటకు చేయబడని యెడల మరెందుకు అతడు చేయబడెను?

## భౌతిక కోరికల నెరవేర్పు

మానవుని భౌతిక సంబంధమైన కోరికలను తీర్చుకొను ఆధారము భూమిపై యున్నది. శబ్ద తరంగములను పరిగ్రహించుటకు చెవులు అవుసరము. వర్ణములను గుర్తించుటకు నేత్రము లవుసరము. వాతావరణములోని గాలిని పీల్చుటకు ఊపిరితిత్తులు అవుసరము. ఆహారమునకు ఆకలియు, దాహమునకు దప్పికయు అవుసరము. ఈ భౌతికావుసరము లన్నిటిని తీర్చుకొనుటకు మానవుని శరీరమును దేవుడు తయారు చేసెను. అట్లయినపుడు నిత్యము జీవించవలెనని మానవునికున్న ఆత్మీయ తృష్ణను దేవుడు తీర్చడా?

ప్రకృతిని మనము గమనించుటద్వారా అమర్త్యత మరింత నిశ్చయము అని మనకు ఋజువు అగుచున్నది. గొంగలి పురుగు సీతాకోక చిలుకగా మారి స్వేచ్ఛగా తిరుగులాడుటలో మానవునికున్న నిత్యజీవిత తృష్ణ తీర్చబడగలదని నిశ్వసించవచ్చును. ఈ శరీర బంధకముల నుండి మానవుని ఆత్మ నిత్యత్వములో ప్రవేశించుట ఆ పురుగులో మనకు కనబడుచున్నది. ప్రకృతిలోని ఋతువులే మరణమును, సమాధిని, అనగా కొంత కనిపెట్టు కాలము, అటు తరువాత అతి మనోహరమైన క్రొత్త జీవితము జీవించుటకు ఒక పునరుత్థానమును సూచించుచున్నవి. ఆయా సంగతులద్వారా మానవుడు ఈ లోక జీవితముకంటె ఘనమైన జీవితము కొరకు ఎదురు చూడవచ్చునని దేవుడు చెప్పకపోతే వాటియొక్క ప్రయోజన మేమి? అందుకే "దేవుని అదృశ్య లక్షణములు, అనగా ఆయన నిత్యశక్తియు, దేవత్వమును,

జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడు చున్నవి" యని అపో. పౌలు రోమా 1:20లో వ్రాసెను.

## నైతిక పరిజ్ఞానము

మానవుని నైతిక పరిజ్ఞానమే నైతిక విలువలు కాపాడు దేవుడొకడు ఉన్నాడని మనకు తెలియజేయుచున్నది. ఈ లోకమంతయు ఒక నైతిక చక్రములో యుండి పరిభ్రమించుచున్నట్లు మనము చూడగలము. ఈ నైతిక చక్రములో మానవుడు తన క్రియలనుబట్టి ప్రతిఫలము నొందుటకో లేక శిక్ష ననుభవించుటకో ఎదురు చూచుచున్నాడు. అయితే ఒక్కొక్కసారి నీతిమంతులు శ్రమల నొందుట, దుర్మార్గులు సుఖముగ జీవించుట, సజ్జనులు పరాజయులగుట, దుర్జనులు విజేయులగుట మనము చూచుచుందుము. అట్టి సమయాల్లో మానవులు ఈ జీవితములో కాకపోయిన భావి జీవితంలో న్యాయము దేవుడు తప్పక తీర్చునని యెదురు చూచుట సహజము. ఈ భావిజీవితంలో నీతిమంతులకు న్యాయము చేకూర్చబడుట, అనీతిమంతులు తగిన రీతిగ శిక్షింపబడుట జరుగునని మనందరము యెదురు చూచుచునే యున్నాము. నిత్యజీవితం అంటూ లేనియెడల మానవునికున్న ఈ నైతిక విలువల ప్రయోజనము శూన్యమేగదా.

నిత్యజీవితమనునది నమ్మదగిన వాస్తవమని బైబిలు బోధించుచున్నది. పాతనిబంధనలో ఇద్దరు భక్తులు హానోకు, ఏలియా అను వారు మరణమును చూచి చూడకనే పరమునకు కొనిపోబడుటను గూర్చి చెప్పబడి యున్నది. మరియు దేవుడు నిర్ణయించిన ఒకానొక దినమందు "సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు. కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా సేయులగుటకును మేలుకొందురు" అని దానియేలు 12:2లో వ్రాయ బడి యున్నది.

## క్రీస్తులో దృఢమైన వాస్తవము

యేసుక్రీస్తునందు నిత్యజీవితము దృఢమైన వాస్తవమని మనకు మరింత తేటగా బోధింపబడినది. మరణించిన వారిలో ప్రథమఫలముగా ఇక నెన్నడు మరణించకుండు నిమిత్తము క్రీస్తు మృతులలోనుండి లేపబడి యున్నాడు. యేసుక్రీస్తు మానవజాతికి నిత్యజీవితమును ప్రసాదించుట కొరకు చనిపోయెను. యేసుక్రీస్తు మరల రాబోవుచున్నాడని, మృతుల పునరుత్థానము జరుగునని, తీర్పు తప్పక జరుగునని, ఈ జీవితాంతమున ప్రతివాడు తాను చేసిన క్రియలనుబట్టి ప్రతిఫలమో లేక శిక్షయో పొందునని చేయబడిన వాగ్దానము లన్నియును మనము నిత్యము జీవించెదమని నిర్ధారణ చేయుచున్నవి (యోహాను 5:28-29, మత్తయి 10:28, 1 కొరింథి 15:53-54, 2 కొరింథి 5:1-4).

"కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుగాని దేవుని ఉగ్రత వానిమీద నిలచి యుండును" అని యేసు బోధించెను (యోహాను 3:36). యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. అటు తరువాత నీవు మరణము వరకు నమ్మకముగా యున్న యెడల ఆయన నీకు నిత్యజీవిత కిరీటాన్ని బహూకరించును (యోహాను 14:1, అపో.కా. 2:38, ప్రకటన 2:10).

—జాషువా గూటం.

---

సత్యవాణి అను మా రేడియో కార్యక్రమములను ప్రతి శని, ఆది, మంగళవారాల్లో మధ్యాహ్నం గం 2-00 లకు మరియు గురు, శుక్ర వారాల్లో మధ్యాహ్నం గం 2-15 ని॥లకు రేడియో శ్రీలంక ద్వారా వినండి. అది మీ ఆత్మీయ జీవితమునకు ఎంతో ఉపయోగకరం.

# వారు క్రైస్తవులెలా అవుతారు?

## (How can they be Christians ?)

బైబిలు గ్రంథము ఒకే మార్గమునుగూర్చి, ఒకే సంఘమును గూర్చి స్పష్టముగా బోధించుచున్నది. మనుష్యులు సత్యమునుండి తొలగిపోయి తమతమ స్వంత మార్గములను, సంఘములను ఏర్పరచుకు న్నారు. అలా ఏర్పడిన మతశాఖలు (మనుష్యుల సంఘములు) దాదాపు ప్రపంచమం దంతట 250 ఉన్నాయి. వీటిలో ఏ రెండుకూడా అన్ని విషయాలలో ఏకీభవించవు. వివిధ విశ్వాసములు, బోధలు, పద్ధతులు, ఆరాధన క్రమములు, సిద్ధాంతములు కలిగియున్న ఈ 250 మతశాఖ లన్నింటికి క్రీస్తు శిరస్సు అని బోధించువారు, విశ్వసించే వారనేకు లున్నారంటే ఆశ్చర్యమౌతుంది. సులువైన సత్యాన్ని ఎందు చేత ప్రజలు గ్రహించకున్నారో అర్థం కావడం లేదు.

బైబిలు చెబుతుంది: "శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాస మొక్కటే బాప్తిస్మ మొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే" (ఎఫెసీ 4:4-5).

"శరీర మొక్కటే". ఆ శరీరము సంఘమైతే, సంఘ మొక్కటే (ఎఫెసీ 2:16; 1 కొరింథి 12:12, 13, 20). ఆ సంఖ్య స్పష్టంగా చెబు తుంది. ఒకే శరీరము (సంఘము) పై ఒకే శిరస్సు (క్రీస్తు) ఉండాలని. మతశాఖలవారు 250 సంఘములకు ఒకే శిరస్సు అని క్రీస్తును హాస్యా స్పదంగాను, వికృతాకారంగాను చిత్రీకరిస్తున్నారు. వారు క్రైస్తవు లెలా అవుతారు?

—వి.జె. బెన్సన్, హైదరాబాద్.

—o—

# సత్యవాక్కు పాఠకులకు గమనిక

ఈ సంచికతో సత్యవాక్కు 14వ సంవత్సరములో ప్రవేశించింది. గత 13 సంవత్సరాలలోను దేవుని మహోచితమైన కృపను బట్టి ప్రతి నెల విడువకుండా ఈ పత్రికను సమయానికి మీ చేతులలో వుంచగలిగాము. దీనిలో ప్రచురింపబడిన వ్యాసములు, గేయములు వగయిరా అన్నీ సత్యవాక్యము ననుసరించి యున్నవే. యేసుప్రభువును ఆయన సంఘాన్ని సత్యవాక్యాన్ని అన్ని వేళలా పైకెత్తుటకే ప్రయత్నించాము, ప్రయత్నిస్తాము. బోధకులకు, ఉపదేశకులకు, సామాన్య సభ్యులకు కూడ సత్యవాక్కు ఉపయోగకారిగ యున్నది.

ఈ సంచికతో సత్యవాక్కు 8100 గృహాలను దర్శించుచున్నది. నెలకు మూడువందలమందికి పైగా సత్యవాక్కు కావాలని మాకు వ్రాయుచున్నారు. ఆర్థిక వనరుల కొరతవలన వారందరికీ ఈ పత్రిక పంపించ లేక పోవుచున్నాము. ఈ పత్రిక మొదలుపెట్టిన నాటినుండి దీనికి సాలు చందా ఇంతయని మేము నిర్ణయించ లేదు. సరిగదా గత మే నెల నుండి 5000 కాపీలు మాత్రమే ముద్రించుటకు వనరులు సమకూడాయి. అయినను మిగతా 3100 మందికి ఈ పత్రికను పంపించుట మానివేయ లేదు. భవిష్యత్తులో సత్యవాక్కు కావాలనిమీరు కోరుచున్న యెడల సత్యవాక్కుకు కొంత నగదు కానుకను పంపిస్తూ మీ కోరికను వెంటనే మాకు తెలియజేయండి. మీనుండి మాకు ఏవిధమైన వార్త రాకపోతే మీ పేరు సత్యవాక్కు జాబితానుండి తొలగించబడును. అట్లు చేయుటకు మాకు ఇష్టము లేకపోయినను ఆర్థికపరమైన ఇబ్బందులదృష్ట్యా మేము చేయక తప్పదు. మీరు మాకు జాబు వ్రాయునప్పుడు మీ సత్యవాక్కు సభ్యత్వ నంబరు మాకు తప్పక తెలియజేయండి. మీ కానుకలను ఈ దిగువ చిరునామాకు పంపించండి :

SATYA WAKKU P.O. Box 80 KAKINADA-533001

# లోకమును ప్రేమింపకుడి

## (Love Not The World)

అపో. యోహాను ఇట్లు వ్రాసాడు: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందు నట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). యిది మనందరము ఎరిగిన వచనమే. అయితే తరువాత అదే అపొస్తలుడు ఈలాగ వ్రాసాడు: "ఈలోకమునైనను లోకములో ఉన్న వాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో ఉండదు" (1 యోహాను 2:15). మానవుని చేయవద్దని చెప్పిన దానిని దేవుడు చేస్తాడా? దేవుడు లోకమునెంతో ప్రేమించెను అన్నప్పుడు ఆయన లోకములోయున్న మనందరిని, ప్రశస్త ఆత్మలను ప్రేమించాడని యర్థము (ఆది 1:26-27). అయితే 1 యోహాను 2:15లో ఈ లోక సంగతులను, ఈలోక సంబంధమైన మార్గములనుగూర్చి చెబుతున్నాడు. "లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు, నేత్రాశయు జీవపు డంబమును తండ్రివలన పుట్టినవి కావు. అవి లోకసంబంధమైనవే" (1 యోహాను 2 : 16).

ఈలోక సంగతులు దేవుని సంబంధమైనవి కావని దేవుని వాక్యము మనకు తెలియజేయుచున్నది. అవి మానవునికి తన సృష్టికర్తకు గల సంబంధమును నాశనము చేయునట్టివి. కొలస్స 4:14 లో పౌలు ఇట్లు వ్రాసాడు: "లూకా అను ప్రియుడైన వైద్యుడును దేమాయు మీకు వందనములు చెప్పుచున్నారు". వీరిద్దరు బహుశ నమ్మకమైన క్రైస్తవులే. అయితే పౌలు తన జీవితాంత సమయములో 2 తిమోతి 4:9, 10 లో ఇట్లు వ్రాసాడు: "దేమా యిహలోకమును స్నేహించి నన్ను విడచి థెస్సలోనీకకు వెళ్ళెను". ఈలోకాన్ని "ప్రస్తుతపు

దుష్టకాలమని" పౌలు వర్ణించాడు (గలతీ 1:4). నమ్మకమైన క్రైస్తవునిపై లోకము సాధించే విజయానికి దేమా ఒక విచారకరమైన ఉదాంతముగా మిగిలిపోయాడు.

ఈ లోకము శాశ్వతము కాదని, అది గతించిపోవునదని క్రైస్తవుడు నిత్యము ఎరిగియుండాలి (1 యోహాను 2 : 17). ఈలోక స్నేహం దేవునితో వైరము (యాకోబు 4:4). అందుకే మీరు ఈలోక మర్యాద ననుసరింప వద్దని పౌలు క్రైస్తవులను హెచ్చరించాడు (రోమా 12:2). మరియు దేవుని పిల్లలు "పైనున్న వాటిమీదనేగాని భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనకూడదని" అతడు హెచ్చరించాడు (కొలస్స 3:2). క్రీస్తు రాజ్యము ఈలోక సంబంధమైనది కాదని దేవుని బిడ్డలు గమనించాలి (యోహాను 18 : 36). మరియు ఈ లోకము వారి శాశ్వత గృహము కాదు. వారు భూమిమీద పరదేశులును యాత్రికులునై యున్నారు (హెబ్రీ 11 : 13, 1 పేతురు 2 : 1). ఈ వాస్తవాన్ని ఎల్లప్పుడు గుర్తెరుగుచు వారు ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను భక్తితోను బ్రదుకుచు లోకమును జయించాలి (తీతు 2:12; 1 యోహాను 5:4).

—తామస్ F. యీవ్స్. (TVC)

— o —

## పాతాళలోక ద్వారములు

"మరియు నీవు పేతురువు ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని..." మన ప్రభువైన యేసు తానే స్వయముగా తెలియజేసి యుండెను (మత్తయి 16:18). పాపియైన ప్రతి మానవుడు పాతాళలోక ద్వారములు చూడవలసి యున్నాడు. ఎందుకనగా "...ఒక మనుష్యుని ద్వారా పాపమును, పాపముద్వారా మరణమును లోకములో ఏలాగు

ప్రవేశించెనో, ఆలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికి సంప్రాప్తమాయెను" (రోమా 5 : 12). "... అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్య జీవము" (రోమా 6 : 23). "క్రీస్తు యేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాప మరణముల నియమమునుండి నన్ను విడిపించెను..." (రోమా 8:2).

నోవహు కాలమున పాపము బహుగా విస్తరించినప్పుడు, దేవుని కృపావరము కూడ మిక్కిలిగా విస్తరించి నోవహు ద్వారా నూట ఇరువది సంవత్సరములు దైవోగ్రతను, మారుమనస్సును గూర్చి బోధించబడిరి. అయినను ఆనాటి ప్రజలు వాటిని మనసున పెట్టక నాశనమైరి. దైవాజ్ఞను శిరసావహించిన వారికొరకు దేవుడు ఆశ్రయ స్థానముగా నోవహుద్వారా ఓడను నిర్మించెను. ఆ శ్రమ కాలమున ఓడనందున్న వారికి మాత్రమే రక్షణ - సంరక్షణ సమకూడెను.

ఇశ్రాయేలు కాలములో నేరస్థుల సంరక్షనార్థమై ఆశ్రయ పురములు ఏర్పరచ బడినవి: "నీ రెక్కల నీడక్రింద నన్ను దాచుము" అని కీర్తనలు 17:9 లో దావీదు చెప్పెను. మరియు "ఆపత్కాలములో ఆయన నన్ను దాచును" అని కీర్తనలు 27:5లో పలికెను. ఈలాగున దేవుడు తన చిత్తము నెరవేర్చు ప్రజల కొరకు పోషక స్థానములు, ఆశ్రయ స్థానములను ఏర్పాటు చేసెను.

భూలోకములో పాపము బహుగా విస్తరించిన ఈ కాలమున, ఎవరిని మ్రింగుదునా అని పాతాళము ఎదురు చూస్తున్న ఈ కాలమున ప్రభువు కృప బహుగా విస్తరించి మనలను పాతాళమునుండి విడిపించుటకు తన సంఘమును మనకు అనుగ్రహించెను. అయితే అనేకులు ఆయన సంఘ ప్రాముఖ్యతను గుర్తెరుగుట లేదు. క్రీస్తు సంఘము పాతాళలోక ద్వారముల నుండి మనలను విడిపించ గలదని మనము గ్రహించాలి.

ఈ అంత దినములలో ప్రతివారు దాగు చోటు సంఘము. అది క్రీస్తువారు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘము (అపో.కా. 20:28). ఆ సంఘమునకు పునాది ఆయనే (1 కొరిం 3:11). మరియు మూలరాయి ఆయనే (ఎఫెసీ 2:20). ఇట్టి సంఘమును వ్యతిరేకించువాడు పాపము చేసినవాడై పాతాళలోక ద్వారములకు పోవలసియుండును.

మిత్రుడా కయీను నడచిన త్రోవను నడువక, బిలాము త్రోవలో పయనించక క్రొత్తనిబంధన ప్రకారము ఆయన సంఘములో సభ్యుడవై పాతాళలోక ద్వారములనుండి విడిపింపబడుము. "తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపో.కా. 22:16). ఈలాగున చేసి రాబోవు ఉగ్రతనునుండి లేక పాతాళలోకము నుండి విడిపింపబడుము.

—డి. అబ్రాహాము, నడిపూడి.

—o—

## క్రీస్తు పునరుత్థాన దినము ఆదివారమే

( మార్కు 16 : 9 )

క్రీస్తు సమాధినుండి మూడవ దినమున లేచెనని లేఖనములు చెప్పుచున్నవి (మత్త 16:21, 17:23, 20:19, 27:64, 26:61, లూకా 9:22, 13:32, 18:33, 24:7, 21, 46, యోహా 2:19, అ.కా. 10:40 1 కొరి 15:4). క్రీస్తు మూడవ దినమున లేతునని చెప్పెను. దూతలు ఆయన మూడవ దినమున లేచెనని చెప్పిరి. మార్గస్థులు క్రీస్తు మరణించి నేటికి మూడు దినములాయెనని చెప్పిరి. లేఖనముల ప్రకారము ఆయన మూడవ దినమున లేపబడెను అని లేఖనములు తెలియజేయుచుండెను.

మొదటి నెల 14వ దినమందు జరిగే పస్కాదినమున క్రీస్తు సిలువ వేయబడెను. ఆ రోజు విశ్రాంతి దినమునకు పూర్వము అనగా ఆరవ రోజు శుక్రవారము. ఆ మరుసటి విశ్రాంతి దినమైన శనివారము

మహా దినమేగాని "మహా విశ్రాంతి దినము" కాదు. ఈ మహా విశ్రాంతి దినము 7వ నెల 10వ దినమున జరుగును. గనుక 1వ నెల 14వ దినమందు జరుగుచున్న పస్కాకు మరుదినమైన 15వ దినమందు ఆ మహా విశ్రాంతి దినము రాదు.

అయితే 1వ నెల 14వ దినమందు జరిగే పస్కా పండుగ తరువాత 15వ దినమందు పులియని రొట్టెల పండుగ జరుగును. ఈ పండుగలు, నెలలు, తేదీలు ప్రకారమే వచ్చును గాని వారం, వారం వచ్చే రోజులు శుక్ర, శని, ఆది అను వాటి ప్రకారము రావు.

ఇక్కడ పస్కా పండుగ శుక్రవారం వచ్చినందున ఆ మరుసటి రోజు శనివారం విశ్రాంతి దినము అయింది. అది, మొదటి నెల పదునైదవ దినము.

1. అది పులియని రొట్టెల పండుగకు మొదటి దినమును,
2. అది, వారం వారం వచ్చే విశ్రాంతి దినమైన శనివారం మాత్రమే (లేవీ 23 : 3)

క్రీస్తును సిలువ వేసిన పస్కా దినమునకు మరు దినము రెండు ప్రాముఖ్య విషయములను కలిగియున్నది.

1. విశ్రాంతి దినమైన శనివారం
2. పులియని రొట్టెల పండుగ దీనినే పొంగని రొట్టెల పండుగ అనికూడా అంటారు (లేవీ 23:5).

పస్కా పండుగ రోజున క్రీస్తు సిలువ వేయబడినందున ఆ మరుసటి దినము పొంగని రొట్టెల పండుగ. మరియు అది విశ్రాంతి దినమైన శనివారం. ఈ రెండు ఒకే దినమై యున్నందున ఆ విశ్రాంతి దినము మహా దినము అనబడెను (యోహా 19 : 31). గాని అది మహా విశ్రాంతి దినం కాదు. "మహా విశ్రాంతి దినము" అనునది మొదటి నెలలో రాదు. అది ఏడవ నెల పదియవనాడు వచ్చే పండుగ. అది మహా విశ్రాంతి దినము అనబడును (లేవీ 16 : 29-31, 23:26-32).

## క్రీస్తు సిలువ వేయబడిన రోజు

1. పస్కా పండుగ
2. విశ్రాంతి దినమునకు పూర్వ దినము.

## మొదటి దినము శుక్రవారం

1. A. పస్కా పండుగ. 1వ నెల 14వ దినం (యోహా 18:28, 39).
B. అది సిద్ధపరచు దినము అనగా విశ్రాంతి దినమునకు పూర్వదినము (మార్కు 15:42).

అందు వలన అది శుక్రవారం. ఏలయనగా విశ్రాంతి దినమైన శని వారమునకు పూర్వ దినము శుక్రవారమేగా! ఈ రోజే క్రీస్తు సమాధి చేయబడెను. స్త్రీలు సుగంధ ద్రవ్యములు సిద్ధపరచిరి.

## రెండవ దినము శనివారము

2. విశ్రాంతి దినము ఆజ్ఞ చొప్పున తీరికగ ఉండిరి (లూకా 23:55, 56; మార్కు 16:1).

## మూడవ దినము ఆదివారము

3. "ఆదివారమున తెల్లవారినప్పుడు యేసు లేచి...మరియకు మొదట కనబడెను" (మార్కు 16:9).
విశ్రాంతి దినము గడచిపోగానే ఆదివారం (యోహా 20:1, మత్త 28:1, మార్కు 16:1, లూకా 24:1).
మూడవ దినమున క్రీస్తు మృతులలోనుండి లేచెను (లూకా 24:7, 21:46).

## ఉదాహరణగా యోనా

యోనా వలె మూడు దివారాత్రులు క్రీస్తు భూగర్భములో ఉన్నాడనుట ఎంతమాటో (మత్త 12:40), నేను భూమిమీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి. ఖడ్గమునే గాని సమాధానము నేను పంప రాలేదు (మత్త 10 : 34) అన్న మాటకూడా

అంతే. ఈ రెండింటిలో నున్న అక్షరార్థం మనకు వద్దు. ఏలయనగా మరొకచోట పునరుత్థానమును గూర్చి మూడవ దినమున లేతును అని యేసు చెప్పెను (మత్త 16:21). ఆలాగే సమాధానమునుగూర్చి "నా శాంతినే మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను. లోకమిచ్చు నట్లుగా నేను మీకు అనుగ్రహించుట లేదు". "నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను" (యోహా 14:27, 16:33) అని క్రీస్తు చెప్పాడు.

ఇపుడు దేనిని మనము అనుసరించాలి? మత్త 10 : 34 నా లేక యోహా 14:27 నా?

మత్త 10 : 34 అక్షరార్థంగా మనము తీసికొనకపోతే మత్త 12:40 కూడా అక్షరార్థంగా తీసికోకూడదు.

ఇందును బట్టి మత్త 10:34 ను 12:40 ని మనము అక్షరార్థంగా తీసుకొనక యోహాను 14 : 27 లోనున్నట్లు క్రీస్తు సమాధానము ఇచ్చుటకు వచ్చియున్నాడనియు; మత్త 16:21 లో నున్నట్లు క్రీస్తు మూడవ దినమున మృతులలోనుండి లేచి యున్నాడనియు నమ్మెదము. శనివారపు వారు చెప్పే కట్టుకథలు మనకు వద్దు. క్రీస్తు మూడవ దినమున లేచెను. దీనికి తిరుగు లేదు.

—పాల్ గూటం, గొల్లపల్లి 533 222.

---

## యేసుక్రీస్తు దేవుని కుమారుడా!

### ( Jesus Christ, the Son of God )

క్రీస్తు సత్పురుషుడేగాని దేవుని కుమారుడు కాదని కొందరు చెబుతారు. ఆయన మంచివాడని వారెందుకు చెబుతున్నారు? ఆయనను గూర్చి క్రొత్త నిబంధన యేమి చెప్పుచున్నదో దానిని బట్టి వారలాగ అంటారు. అయితే అదే క్రొత్తనిబంధనలో యేసు పర

లోకమునుండి వచ్చిన వాడనని, దేవుని కుమారుడనని చెప్పిన సందర్భాలు అనేకము లున్నాయి. తాను ఏమైయున్నాడో యను దానిని గూర్చి ఆయన చెప్పిన సంగతులు యదార్థము కాకపోతే, ఆయన ఏమాత్రము మంచివాడు కాడు. ఏలయనగా మంచివాడెవడును తనను గూర్చి తాను అబద్ధాలు చెప్పడు. యేసుక్రీస్తు నిస్సందేహంగా, నిజంగా దేవుని కుమారుడు.

క్రైస్తవులు దేవుని వాక్యమూలముగా దేవునిచే జనింపజేయబడినవారు గనుక దేవుని పిల్లలు (యాకోబు 1 : 18). అయితే యేసుక్రీస్తు ఒక్కడు మాత్రమే దేవుని సొంత కుమారుడు. కన్యయైన మరియు పరిశుద్ధాత్మ దేవుని వలన అద్భుత రీతిగా గర్భము ధరించి కుమారుని కనినప్పుడాయన దేవుని వలన జనింపజేయబడినవాడాయెను.

యేసుక్రీస్తు దేవుని కుమారుడు, మానవాళి కంతటికీ రక్షకుడు. మనుష్యు లందరి పాపముల నిమిత్తము ఆయన రోమా సిలువపై చనిపోయాడు. ఆయన చనిపోయి సమాధి చేయబడిన మూడవ దినమున తండ్రియైన దేవుడు మృతులలోనుండి ఆయనను లేపి మనందరికీ రక్షకుని చేసాడు (రోమా 4:24; లూకా 24:46, 47; 1 కొరింథీ 15:1-8).

యేసు అందరికొరకు చనిపోయాడు. నిజమే గాని అందరు రక్షింపబడరు. అందరు రక్షింపబడాలని దేవుడు కోరుచున్నాడు (1 తిమో 2 : 3, 4). గాని ఎవరైతే యేసుక్రీస్తు దేవుని కుమారుడని నమ్ముతారో వారు మాత్రమే రక్షింపబడతారు. ఆయనను నమ్ముకొనుట యంటే ఆయన సువార్తను విశ్వసించుట, ఆయన దేవుని ఏకైక కుమారుడని నమ్ముట, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుట, యేసు దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొనుట మరియు పాపక్షమాపణ నిమిత్తము నీటిలో బాప్తిస్మము పొందుట. అట్లు చేయుటద్వారానే క్రీస్తు రక్తము నీ పాపములను

కడిగివేయును (యోహాను 8 : 21-24; రోమా 10 : 9-10; 6 : 3-4; కొలస్స 2:12; అపో.కా. 2:38).

ఆయనను గూర్చిన సువార్తను విని విశ్వసించి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడునని యేసు చెప్పాడు (మార్కు 16:15, 16). విశ్వాసులు మారుమనస్సు పొంది ప్రతివాడు పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెనని, అప్పుడు వారికి పరిశుద్ధాత్మ అను వరము అనుగ్రహించబడునని పేతురు చెప్పాడు (అపో.కా. 2:38). అలా చేసినవారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొంటాడు (అపో.కా. 2:47). రక్షింపబడి క్రీస్తు సంఘముతో చేర్చబడాలంటే మీకు సమీపముగానున్న క్రీస్తు సంఘాన్ని దర్శించండి, లేదా మాకు తెలియజేయండి.

—బేసిల్ ఓవర్టన్ (TWE)

— o —

## సంక్షిప్త వార్తలు

1993 జూలై నెల 5, 6 తేదీలలో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురమునకు సమీపము నున్న అగ్రహారం గ్రామములో గల క్రీస్తు సంఘ ఆలయములో సువార్త కూటములు జరిగాయి. సంఘ సభ్యులు తదితరులు అనేకులు ఈ కూటములకు హాజరై దేవుని వాక్యమును వినిరి. సోదరులు పి. ప్రకాశంగారు (హైదరాబాదు), కె. కొర్నేలియస్‌గారు (కోరుకొండ), జాషువా గూటంగారు దేవుని వాక్య పరిచర్య చేసిరి. మొదటి దినం 6 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అగ్రహారం గ్రామంలో సోదరులు పి. సుందరావుగారు సువార్తికునిగా పని చేయుచు క్రీస్తు కొరకు అనేక ఆత్మలను సంపాదించుచున్నారు.

*　　*　　*

జూలై 17, 18 తేదీలలో సోదరులు జాషువా గూటంగారు రెండు రోజుల పాటు సతీ సమేతంగా విజయవాడ పట్టణంలో సువార్త సంబంధ

మైన వివిధ కార్యక్రమములలో పాల్గొని దేవుని వాక్య పరిచర్య చేసిరి. 17వ తేదీ ఉదయం 10 గంటలకు సీతారాంపురంలో (విజయవాడ-2) నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయాన్ని సోదరి కవితా గూటంగారు రిబ్బను కత్తిరించి తెరిచారు. ఆ సందర్భంగా జరిగిన కూటములో జాషువాగారు చక్కటి వాక్య పరిచర్య చేసారు. సోదరులు M. జాన్ బాలసుందరంగారి పర్యవేక్షణలో సమస్తము సక్రమముగాను, దేవునికి మహిమకరంగాను జరిగించబడింది. స్థానిక సోదర సోదరీలు, ఇతర పట్టణములనుండి వచ్చిన అనేక మంది సువార్తికులు ఈ ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైరి. సీతారాంపురంలో Bro. G. సమూయేలు గారు సువార్త పని చేయుచున్నారు. అదేరోజు సాయంత్రం 7 గంటలకు మధురానగరంలో (విజయవాడ-11) నిర్మించబడిన మరొక క్రీస్తు సంఘ ఆలయాన్ని జాషువాగారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసారు. సోదరులు M. జాకబ్ గారు అక్కడ సువార్త పని చేయుచున్నారు. జాషువాగారి వాక్య పరిచర్య అనంతరం ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందారు. విజయవాడ పట్టణంలోను ఇతర ప్రాంతములలోను సోదరులు M. జాన్ బాలసుందరంగారు క్రీస్తుకొరకు మంచి నాయకత్వం వహించుచు ఆయన రాజ్య సువార్తను అందించుచున్నారు. 18వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ రాణిగారి తోటలో యున్న క్రీస్తు సంఘానికి జాషువావారు సతీసమేతంగా హాజరై అక్కడకూడ వాక్యపరిచర్య చేసారు. రాణిగారి తోటలో యున్న సంఘము సోదరులు M. జాకబ్ గారి వాక్యపరిచర్యవలన దినదినాభివృద్ధి నొందుచున్నది.

* * *

జూలై నెల సువార్తికుల సదస్సు మరియు సువార్త కూటములు 26వ తేదీ సోమవారం జగన్నాధగిరిలో విజయవంతముగ జరిగెను. ఈ పరిచర్య ద్వారా దేవుని చిత్తమును పూర్ణముగ గ్రహించినవారై ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు

అభివృద్ధి పొందుచు సువార్తికులు ఆయన సేవలో కొనసాగుచున్నారు. దూరప్రాంతములనుండి విచ్చేసిన సువార్తికుల సమక్షంలో "లేఖనార్ధమైన సంఘు మేది? దానిలో సభ్యుడగుట ఎట్లు?" అను చక్కని అంశము చర్చింపబడెను.

ప్రశాంత వాతావరణములో ప్రారంభమైన ఉదయకాల సమావేశమునకు సోదరులు జాషువా గూటంగారు అధ్యక్షులుగా ఉండి సమయోచితంగాను సమర్ధవంతముగాను కార్యక్రమమును నడిపించిరి. సోదరులు పాల్ గూటంగారు, జి. పడ్రిక్ గారు, బి. యోహానుగారు, పి. ప్రకాశంగారు, డి. శ్రీరాములుగారు మరియు అధ్యక్షులు ఈ చర్చా కార్యక్రమమునందు పాల్గొనిరి. మధ్యాహ్న సమావేశమునకు కూడ సోదరులు జాషువా గూటంగారు అధ్యక్షత వహించిరి. సోదరులు టి. జ్ఞానానందంగారు, నెహెమ్యా గూటంగారు, పి. ప్రకాశం గారు మంచి వర్తమానము అందించిరి.

నేడు ప్రపంచములో అనేక మతశాఖలు, విభిన్న బోధలు కలవరాన్ని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితిలో సత్యాన్వేషుల మనస్సులో ఉద్భవించే ప్రశ్న "లేఖనార్ధమైన సంఘు మేది?" అనునది సంఘు నామము, రక్షణ సంకల్పము, ఆరాధన, విశ్వాసము లేఖనములలో వ్రాయబడిన ఉపదేశ క్రమమును అనుసరించి యుంటే అదే లేఖనానుసారమైన సంఘుమౌతుంది. క్రీస్తు పేరుతో పిలువబడక వేరే నామముతో పిలువబడుచున్నవారు "మేముకూడ క్రీస్తు సంఘుమే" అని అంటున్నారు. వారి మాటలకు లేఖనాధార మేమియు లేదు. సంఘుము క్రీ॥శ లిలివ సం॥రములో యెరూష లేములో పెంతెకోస్తు అను పండుగ దినమున స్థాపించబడెను. ఏ సంఘుమైతే ఆదిమ సంఘుము అనుసరించిన ఉపదేశక్రమమును అనుసరించుచున్నదో అదే లేఖనానుసారమైన సంఘుము. సంఘుము, క్రీస్తు అంటే శరీరము, శిరస్సులాంటి విడదీయలేని సంబంధము కలిగియున్నవి. దేవునికి క్రీస్తు యేసు మూలముగా తర తరములు సంఘుములో మహిమ కలుగవలెనని పౌలు చెప్పెను (ఎఫెసీ 3 : 21). సంఘుము కొరకు ప్రభువు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫె 5:25). దేని నిమిత్తమై ప్రభువు తన రక్తమును చిందించెనో ఆ సంఘుమునకు ప్రాముఖ్యము లేదనుట సత్యదూరము.

శరీరమందు రక్తము ప్రవహించు రీతిగనే క్రీస్తు శరీరమైన సంఘములో సమస్త పాపములను కడిగివేయు శక్తిగల క్రీస్తు రక్తము ప్రవహించుచున్నది. అందువలననే మనము పరిశుద్ధులమని పిలువబడుచున్నాము. లేఖనానుసారమైన సంఘముతో నీవు చేర్చబడాలంటే విశ్వసించాలి, మారుమనస్సు పొందాలి, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని బాప్తిస్మము పొందాలి. సమావేశానంతరం వందమందికి పైగా హాజరైన సువార్తికులు జగన్నాథగిరి వీధులలో పాటలు పాడుచు, ఇంటింట సువార్త పత్రికలు పంచుచు దండయాత్ర చేసిరి. తదుపరి ఒక స్త్రీ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందెను. రాత్రి వేళ జరిగిన సువార్త కూటములో జాషువా గూటంగారు వాక్యపరిచర్య చేసిరి. జగన్నాథగిరిలో సోదరులు పి. ప్రకాశంగారు ఒక చక్కటి ఆలయాన్ని నిర్మించి, ఒక సువార్తికుని పోషిస్తు మంచి సేవాకార్యక్రమములు చేయుచున్నారు. జగన్నాథగిరిలో జరిగిన **Preachers' Workshop** జయప్రదం చేయబడుటకు ప్రకాశంగారు, వారి సతీమణి నిర్విరామ కృషి చేసిరి. ఆగష్టు నెల సువార్తికుల సదస్సు అమలాపురం జానకి పేటలో యున్న క్రీస్తు సంఘ ఆవరణలో 26వ తేదీ గురువారం సోదరులు బొంతు ధనరాజుగారి ఆధ్వర్యమున జరుగును.

★

---

**Regd. No. H/KD—45/KD H.O**

From
SATYAVAKKU
P.O. Box 80
KAKINADA 533 001

**No.**

**To**

..............................
..............................
..............................
..............................